

అవకతవకలు లేకుండా బియ్యం పంపిణీ

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

సంక్రాంతి సందర్భంగా జనవరిలో అందజేసే ఉచిత బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు, ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త వహించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. జిల్లాలోని 5.71 లక్షల మంది కార్డుదారులకు ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఉచిత బియ్యం అందజేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న 1249 చౌకధరల దుకాణాల వద్ద గాని, ఎండియు వాహనాల వద్ద గాని లబ్ధిదారుల నుంచి ఎవరైనా సిబ్బంది అక్రమ నగదు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జెసి హెచ్చరించారు.

కొంగొత్త ఆశలు.. ఆశయాలతో..

చరిత్ర పుట్టల్లోకి 2022 సంవత్సరం

న్యూ ఇయర్ వేడుకల్లో ప్రజానీకం

నవ వసంతంలోకి



గిర్రున తిరిగే కాల చక్రంలో మరో ఏడాది (2022) కలిసిపోయింది. జ్ఞాపకాలను చరిత్ర పుటల్లో నిక్షిప్తం చేసింది. గత ఏడాది తీపి, చేదు జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ వీడ్కోలు పలికింది. కొత్త ఆశలను చిగురింపజేస్తూ నూతన సంవత్సరం (2023)లోకి అడుగుపెట్టింది. ఎన్నో ఆశలు.. ఆశయాలతో జిల్లా ప్రజలు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. శనివారం అర్థరాత్రి నుంచీ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇళ్లు, కార్యాలయాల ఎదుట రంగుల హరివిల్లులు, వెల్‌కమ్ బోర్డులు దర్శనమిచ్చాయి. పరస్పర కరచాలనాలు, బంధుమిత్రులు సెల్‌ఫోన్లలో శుభాకాంక్షల సంభాషణలో మునిగితేలారు. పుష్పగుచ్ఛాలు, పండ్లు, కేకుల క్రయ, విక్రయాలతో పట్టణ ప్రాంతాల్లో హడావుడి కనిపించింది. సంఘాలు, శాఖల, మిత్ర బృందాల వారీ విందు, వినోదాలు కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. పలు ఆలయాలు, చర్చిలు విద్యుత్ కాంతులతో కళకళ లాడాయి. హోటళ్లు, పళ్లు, పుష్పగుచ్ఛాల దుకాణాలు కిటకిటలాడాయి. మద్యం విక్రయాల జోరు అమాంతంగా పెరిగింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కాలంలో కలిసిపోయిన 2022లో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా ఒకటేమిటి? అన్ని తరగతులకు చెందిన వారూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా విజయనగరం ఉమ్మడి జిల్లాలో జ్యూట్ పరిశ్రమల మూత కారణంగా కార్మికులు అధిక సంఖ్యలో ఉపాధి కోల్పోయారు. సుగర్ ఫ్యాక్టరీల మూత వల్ల రైతులు అవస్థలు పడ్డారు. రహదారులు, ప్రాజెక్టుల కోసం భూ సేకరణలో రైతులు భూములు కోల్పోవాల్సి వచ్చింది. ఈ ఏడాది వరి దిగుబడి పెరిగినప్పటికీ పెట్టుబడులకు అనుగుణంగా గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉద్యోగులు తమ భవిష్యత్తు కోసం పోరాడాల్సి వచ్చింది. మునుపెన్నడూ లేనంతగా రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పోలీసుల నిర్బంధాలను, ప్రభుత్వ బెదిరింపులను ఎదుర్కోవాల్సివచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజనలో భాగంగా గత ఏడాది ఏప్రిల్ 4న ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైంది. కొత్త కార్యాలయాలు ఏర్పాటై అధికారులు కొలువుదీరారు. విజయనగరం జిల్లాలో మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభమైంది. చీపురుపల్లి, బొబ్బిలి రెవెన్యూ డివిజన్‌లు ఏర్పాటయ్యాయి. అదే సందర్భంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమబాట పట్టారు. మరోవైపు జాతీయ విద్యా విధానం అమలుతో పాఠశాలల విలీనమై పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ఇలా అన్ని తరగతుల ప్రజానీకం గత ఏడాది చేదు, తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎస్‌పి దీపికా పాటిల్ సహా పలువురు అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు జిల్లా ప్రజానీకానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలకు మేలు జరగాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో ప్రజల అభివృద్ధి సాధించాలని, ఆరోగ్యాంగం ఉండాని, సంక్షేమం వర్ధిలాలని, ప్రజలంతా సుఖ శాంతులతో మెలగాలని ఆకాంక్షిద్దాం.

సుఖ సంతోషాలతో ఉండాలి



ఉమ్మడి జిల్లా ప్రజలకు,ప్రజాప్రతినిధులకు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రజలంతా కొత్త సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఉండాలి. గత ఏడాది మాదిరిగానే కొత్త ఏడాది కూడా బాగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరగాలి. సాగు, తాగునీరు, విద్యా, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తాం.

-మజ్జి శ్రీనివాసరావు, జెడ్‌పి చైర్మన్

జీవితాల్లో వెలుగులు నింపాలి



జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ఆయా కుటుంబాలు అభివద్దే పరమావధిగా భావిస్తోంది. అది నెరవేరాలని ఆకాంక్షిస్తున్నాను.

- పి.రాజన్నదొర, డిప్యూటీ సిఎం

అభివృద్ధి దిశగా పయనించాలి



నియోజకవర్గ ప్రజలతో పాటు, జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి. జిల్లా మరింత అభివృద్ధి దిశగా పయనించాలి. ప్రజలకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- కోలగట్ల వీరభద్రస్వామి, డిప్యూటీ స్పీకర్

ప్రజలందరికీ మంచి జరగాలి



2023లో ప్రజలందరికీ మంచి జరగాలి. అందరూ ఆరోగ్యంగా సుఖ సంతోషాలతో ఉండాలి. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి. పంటలు బాగా పండి రైతుల్లో ఆనందాలు వెల్లివిరియాలి. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- ఎ.సూర్యకుమారి, జిల్లా కలెక్టర్

ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలి



నగర ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి. ప్రభుత్వ పథకాలతోనూ, నగరపాలక సంస్థ అందిస్తున్న సేవలతోనూ ప్రతి ఒక్కరు ఆనందంగా జీవించాలి. నగర సుందరీకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి.

- వి.విజయలక్ష్మి, నగర మేయర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

సఖి గ్రూపుల్లో కొత్త జంటలు

- ప్రతీ నాలుగో శనివారం ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో సమావేశం
- కలెక్టర్ సూర్య కుమారి

ప్రజాశక్తి-విజయనగరం

బాలికలు, మహిళల ఆరోగ్యం, భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన సఖి గ్రూపులు మంచి ఫలితాలనిస్తున్నాయని, మరింత చురుగ్గా పనిచేసేలా శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. శనివారం కలెక్టర్ సూర్య కుమారి తన ఛాంబర్ నుంచి టెలి కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేకాధికారులతో మాట్లాడి సఖి సమావేశాల ఫీడ్ బ్యాక్ అడిగి తెలుసుకున్నారు. కొత్తగా పెళ్ళైన జంటలతో ప్రత్యేకంగా గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. గర్భం దాల్చిన నుండి ప్రతి నెల స్కానింగ్ చేయిస్తే బిడ్డకు అనారోగ్యమని, 9 నెలల్లో మూడు సార్లు మాత్రమే స్కానింగ్ జరపాలని, అవసరమైతే వైద్యులే సలహా ఇస్తారనే అంశాలను అర్ధం అయ్యేలా తెలపాలన్నారు. తల్లి పాల విశిష్టత, ఉత్తమ ఆహార పద్ధతులు, పౌష్టికాహారం పై సలహాలు వంటివి తెలియజేయాలన్నారు. నొప్పులను తట్టుకొని కనాలని, సిజేరిన్‌కు తొందరపడి వెళ్లకూడదని, అందు వలన శాశ్వత ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అవగాహన కలిగించాలన్నారు. ప్రతి 4 వ శనివారం మండల స్థాయి లో ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో సఖి సమావేశం జరగాలని, ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని తెలిపారపు. సమావేశాల్లో అంగన్వాడీ పని తీరు, అండర్ వెయిట్ పిల్లలు, హెచ్‌బి తక్కువగా ఉన్నవారి గురించి చర్చించి వారికీ పౌష్టికాహారాన్ని ఎలా అందించాలనే అంశాలపై తగు సలహాలను అందించాలని తెలిపారు. ముఖ్యంగా ఎఎన్‌ఎంలు, మహిళా పోలీస్ లు చురుకుగా పని చేయాలన్నారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ రమణ కుమారి, ఐసిడిఎస్ పీడీ శాంత కుమారి, మెప్మా పీడీ సుధాకర్ రావు, డిఇఒ లింగేశ్వరరెడ్డి, ప్రత్యేకాధికారులు పద్మావతి, అరుణ కుమారి, డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్

విజయనగరం టౌన్ : ఇటీవల జరిగినజాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 55కేజీల విభాగంలో 255కేజీల బరువు ఎత్తి బంగారు పతకం, 49కేజీల విభాగంలో జిల్లాకు చెందిన వి.సుస్మిత 152 కేజీల బరువు ఎత్తి సిల్వర్ మెడల్ సాధించారు.

అనంతపురంలో జరిగిన హేండ్ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్ 14 విభాగంలో బాలికల జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా జట్టును జిల్లా విద్యా శాఖ అధికారి బి. లింగేశ్వర రెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ అభినందించారు.

ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఉపాధి అవకాశాలు కొత్త ఏడాదిలో పెంచే విధంగా కృషి చేస్తామని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులంతా కలిసి కట్టుగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తీసుకెళ్లారని తెలిపారు. 2022లో జిల్లా నుంచి పార్వతీపురం జిల్లా కొత్తగా ఏర్పడడం ముఖ్యమైన ఘట్టంగా గుర్తుండి పోతుందన్నారు. జిల్లాలో రైతులంతా ఖరీఫ్ సీజన్‌లో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఎప్పటి నుంచో కలగా ఉన్న చీపురుపల్లి, బొబ్బిలి రెవెన్యూ డివిజన్‌లు ఏర్పాటయ్యాయని తెలిపారు. గురజాడ జె ఎన్ టి యు, మెడికల్ కాలేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మెడికల్ కాలేజీలో 2023లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. పెంచిన పింఛన్‌ను జనవరి 1 నుంచి అమలు చేస్తున్నామన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తూ సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తామన్నారు.

ఎపిఎన్‌జిఒ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్, ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు

ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2023 జిల్లా క్యాలెండర్‌ను శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జె.మురళి, కార్య దర్శి సురేష్, జిల్లా కోశాధికారి ఎస్.వి సుధాకర్ ,రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ, ఉపాధ్యక్షులు వై ఆనంద కుమార్, కెబి శ్రీనివాస రావు, జాయింటు సెక్రెటరీ మూర్తి , తవుడు, కనకరాజు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రామరాజు ,పైడిరాజు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జెడ్‌పి మినిస్టీరియల్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ 2023 జిల్లా క్యాలెండర్‌ను శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టరు ఎం.అశోక్ కుమార్, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ కె.రాజ్ కుమార్, డిపిఒ జిఎస్ నిర్మలా దేవి, యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ మురళి ఇతర జిల్లా తాలూకా పరిషత్ యూనిట్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

- ఎరుకుల పాకలను పరిశీలించిన సిపిఎం నాయకులు
- ఎఇ, లైన్‌మేన్‌ను సస్పెండ్ చేయాలి
- ట్రాన్స్‌కో ఎస్ఇకి, పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-బాడంగి, బొబ్బిలి

మతం మారలేదని విద్యుత్ శాఖాధికారులు ఎరుకుల పాకల గిరిజనులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం అత్యంత దుర్మార్గమైన చర్యని, వెంటనే కక్ష పూరిత చర్యలు మానుకొని గ్రామానికి, ఇళ్లకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర్రావు డిమాండ్ చేశారు. కక్ష సాధిస్తున్న విద్యుత్‌శాఖ ఎఇ, లైన్‌మేన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మతం మరలేదని బాడంగి మండలం ఎరుకుల పాకల గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యుడు పాలవలస గౌరు పట్ల, గిరిజనుల పట్ల లైన్‌మేన్ కక్షసాధింపు చర్యలకు దిగారు. విద్యుత్ బిల్లు బకాయి ఉందని సాకుగా చూపించి గౌరు ఇంటి విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేశారు. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గ్రామానికి తొలగించి, డైరెక్టుగా కలిపేశారు. గ్రామంలో ఏదైనా విద్యుత్తు ప్రమాదం సంభవిస్తే అంతే సంగతి. ఈనేపథ్యంలో ప్రజాశక్తిలో వచ్చిన కథనాలకు స్పందించిన సిపిఎం నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, శంకర్రావు, సురేష్ శనివారం ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నాయకుల వద్ద గిరిజనులు తమ గోడు వినిపించుకున్నారు. ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో లైన్ మెన్‌గా పని చేసిన జయరాజు గతంలో తమ వద్దకు వచ్చి మతం మారాలని అడిగారని, మతం మారలేమని చెప్పడంతో విద్యుత్ బిల్లు బకాయి ఉందని చెప్పి ఇల్లు, కోళ్ల ఫారం విద్యుత్ కట్ చేసారని చెప్పారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా విద్యుత్ కట్ చేయడంతో హైకోర్టులో కేసు వేయగా మరింత కక్ష పెంచుకుని గ్రామానికి సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్‌ఫార్మర్ వద్ద లైన్ డైరెక్ట్ చేశారని వాపోయారు. విద్యుత్ లైన్ డైరెక్ట్ చేయడంతో హైవోల్టేజ్ రావడంతో మోటార్లు, ఫ్యాన్లు, లైనట్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఎఇ శ్రీనివాసరావు కులం పేరుతో దూషించారని చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులపై ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులపై కక్షసాధింపు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గిరిజనులపై కక్షసాధింపు దుర్మార్గం

గిరిజనులపై విద్యుత్ శాఖ అధికారులు కక్షసాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ విద్యుత్ బకాయి ఉంటే నోటీసులు జారీ చేసి విద్యుత్ కట్ చేయాల్సి ఉన్నప్పటికీ ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా విద్యుత్ కట్ చేయడం అన్యాయమన్నారు. కులం పేరుతో గిరిజనులను దూషించిన ఎఇ శ్రీనివాసరావు, గతంలో పని చేసిన లైన్ మెన్ జయరాజును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకరు విద్యుత్ బకాయి ఉంటే గ్రామ ప్రజలు ఇబ్బంది పడేలా విద్యుత్ లైన్ డైరెక్ట్ చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. జిల్లా అధికారులు స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. గిరిజనులకు సిపిఎం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అక్కడి నుంచే విద్యుత్ శాఖ ఎస్ఇ, బొబ్బిలి డిఎస్‌పి, బాడంగి ఎస్ఐతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే విద్యుత్‌శాఖ సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



గ్రామంలో విద్యుత్తు శాఖ సిబ్బంది కలిపేసిన ఫీజును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు తమ్మినేని

రైతులకు అండగా ఉంటాం

ఎఎంసి చైర్‌పర్సన్ శశిభార్గవి
నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎఎంసి చైర్‌పర్సన్ శశిభార్గవి

అధికారులు, పాలకమండలి సహకారంతో రైతులకు అండగా ఉంటూ, వ్యవసాయ మార్కెట్ కమిటీని మరింత బలోపేతం చేయనున్నామని నూతనంగా నియమితులైన విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్‌వివి శశి భార్గవి అన్నారు. శనివారం విజయనగరం మార్కెట్ కమిటీ పాలకమండలి పదవీ ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్మన్‌గా శశి భార్గవి ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా అధికారులు, మండలం నుంచి తరలివచ్చిన వైసిపి నాయకులు చైర్మన్‌కు, పాలకమండలి సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ శశి భార్గవి మీడియాతో మాట్లాడుతూ పెద్దల సలహాలు సూచనలతో, పాలకమండలి, అధికారుల సమన్వయంతో మార్కెట్ కమిటీని అభివృద్ధి చేస్తామని అన్నారు. తన తండ్రి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు సలహాలు సూచనలు కూడా తీసుకుంటానని అన్నారు. రైతులకు మేలు జరిగేలా కృషి చేస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డి గురుమూర్తి, జొన్నవలస పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాధ్, మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ, మార్కెట్ కమిటీ అభివద్ధికి కషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులతోపాటు విజయనగరం జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, పార్టీ జోనల్ ఇన్‌ఛార్జులు బొద్దాన అప్పారావు, బోడ సింగి ఈశ్వరరావు, వైస్ ఎంపిపి కర్రోతు నారాయణరావు, పార్టీ నాయకులు బోదంకి అప్పలకృష్ణ, సత్తిరాజు, సర్పంచులు, మార్కెటింగ్‌శాఖఖెడి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఉంటుందో..? ఊడుతుందో..?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పింఛను ఉంటుందో...! ఊడుతుందో... అర్థం కాని పరిస్థితి నెలకొందని కొందరు, మరీ ఇంత అన్యాయమా? ఏళ్ల తరబడి పింఛను ఇచ్చి, ఇప్పుడు నోటీసులా అంటూ మరికొందరు, రూ.250 పెంచుతున్నందుకు ఆ మేరకు పింఛన్లు తగ్గించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఈ విషయంలో అధికారులు, సచివాయల సిబ్బంది అత్యుత్యాహం కనబరుస్తున్నారని ఇంకొందరు ఇలా ఒక్కొక్కరూ ఒక్కో విధంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల పింఛను పెంపును ప్రకటించిన విషయం విధితమే. మరోవైపు వెయ్యి చదరపు అడుగుల ఇళ్లు, ఆదాయ పన్ను చెల్లించడం, 500యూనిట్ల విద్యుత్ వినియోగం, నాలుగు చక్రాల వాహనాలు వంటి ఆరు రకాల అర్హతలను ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులకు నోటీసులు జారీచేస్తున్న సంగతి తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 4,800 మందికిపైగా నోటీసులు ఇచ్చినట్టు సాక్షాత్తు జిల్లా కలెక్టరే స్పష్టం చేశారు. ఈనేపథ్యంలో వీరంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పింఛను పెంపు సమయంలోనే అనర్హులు గుర్తుకు వచ్చారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడో తాత తండ్రుల నుంచి 2.3సెంట్ల స్థలానికి మించిన స్థలంలో ఇల్లు ఉంటుంది. కానీ, వారికి సొంత భూమిగానీ, ఇతర ఆస్తిపాసులుగానీ లేవు. జీవనమే దినదిన గండంగా ఉంటుంది. ఇటువంటివారికి కూడా నోటీసులు అందాయి. ఒకేపేరుతో ఉన్న వేర్వేరు వ్యక్తులకు చెందిన విద్యుత్ మీటర్ల రీడింగ్ మెర్జి అయ్యింది. ఈ



విషయం అనేక సందర్భాల్లో జిల్లా పరిషత్ సమావేశంలో కూడా ప్రస్తావనకు వచ్చింది. ఇటువంటివారి రీడింగ్ పరిమితికి మించి ఉండడంతో చాలా మందికి నోటీసులు అందాయి. పెళ్లయిన కూతురికి కారు ఉంటే, వృద్ధాప్యం పింఛను అందుకుంటున్న తండ్రికి నోటీసులు ఇచ్చారు. ఇలా ఓవైపు సాంకేతిక కారణాలు, మరోవైపు భౌతిక పరిస్థితులకు భిన్నమైన వైఖరితో వేలాది మందికి నోటీసులు ఇవ్వడంతో వారంతా బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. మరోవైపు అధికారులు మాత్రం పింఛన్ల ప్రక్షాళన, అర్హులకు మంజూరు అనేవి నిరంతర ప్రక్రియగా ఉంటుందని చెబుతున్నారు. పింఛనుదారులు మాత్రం దీన్ని కొట్టిపారేస్తున్నారు. అలా అయితే ఈ పాటికే అర్హులను తొలగించి ఉండేవారని, పింఛను పెంచుతున్న సమయంలోనే అర్హత అనర్హత అనేవి గుర్తుకు వచ్చాయంటే ఖచ్చితంగా పెరిగిన ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు అర్హత పేరిట కోత విధిస్తోందని అంటున్నారు. ఒకవేళ అధికారులు చెప్తున్నదే వాస్తవమనుకుంటే అనర్హులకు ఇన్నాళ్లూ ఎందుకు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ, ఆయా వంటి స్కీమ్ వర్కర్లు ఉన్న ఇళ్లల్లోనూ పింఛన్లు కోత విధించేందుకు ప్రయత్నించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రక్షాలన పేరిట అర్హులకు అన్యాయం చేస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మరికొందరు విశ్లేషిస్తున్నారు.

ఆదుకుంటామని అడ్రస్ లేకుండా చేశారు..

జామి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో రాష్ట్రంలో ఉన్న అన్ని సహకార షుగర్ ఫ్యాక్టరీలను తాను ముఖ్యమంత్రి కాగానే తెరిపిస్తానని చెప్పి అధికారం చేపట్టక రాష్ట్రంలో ఆరు సహకార చక్కెర ఫ్యాక్టరీలను అడ్రస్ లేకుండా చేసారని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విమర్శించారు. శనివారం భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని జామిలో చెరకు రైతులతో సమావేశమై చెరకు తోటలను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే చిత్తూరు జిల్లాలోని చిత్తూరు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ, అదే జిల్లాలోని గాజుల మండ్యంలోని వెంకటేశ్వర కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ, కడపజిల్లా లోని దొంతాపురంలోని కడప కో-ఆపరేటివ్ షుగర్స్, నెల్లూరు జిల్లా కోవూరు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ, గుంటూరు జిల్లాలోని ఎన్విఆర్ అండ్ ఏఆర్ కో-ఆపరేటివ్ షుగర్స్, విశాఖపట్నం జిల్లా తుమ్మపాల వి.వి.రమణ కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలను పూర్తి స్థాయిలో మూత వేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసిందన్నారు. త్వరలోనే ఏటికొప్పాక, తాండవ, భీమసింగి షుగర్ ఫ్యాక్టరీలను మూత వేసేందుకు తగిన చర్యలకు ప్రభుత్వం సిద్ధమవుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో రైతు సంఘం వేల్పుల నాయుడుబాబు, జామి అప్పారావు, వాసిరెడ్డి అప్పలనాయుడు, గొర్లె రాము, లగుడు రమేష్ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం

వేపాడ : జగనన్న ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ కోరారు. మండలంలోని జాకేరు, కరకవలస గ్రామాల్లో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు చేపట్టకపోతే ఆ స్థలాలను ప్రభుత్వం వెనుక్కు తీసుకుని వేరే వారికి కేటాయిస్తుందని వెంటనే నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్ద అప్పలనాయుడు, దుల్ల అప్పన్న, తహశీల్దార్ కృష్ణంరాజు, ఎంపిడిఒ పట్నాయక్, విస్తరణ అధికారి సిహెచ్ సూర్యనారాయణ ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరకవలసలో దర్యాప్తు ముమ్మరం


చెరువును పరిశీలిస్తున్న తహశీల్దార్

వేపాడ : మండలంలోని కరకవలస రెవెన్యూలో ప్రభుత్వ చెరువులను అక్రమార్కులు కప్పేస్తున్నారని అదే గ్రామానికి చెందిన కొంతమంది రైతులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన తహశీల్దార్ కృష్ణంరాజు శనివారం దర్యాప్తు ముమ్మరం చేశారు. చదును చేసిన చెరువు జిరాయితీ గాను రికార్డులో ఉన్నట్లు గ్రామ రెవెన్యూ అధికారి జి. శ్రీనివాసరావు తహశీల్దార్‌కు తెలుపగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించి ఆక్రమణకు గురైనట్లు తేలితే అక్రమదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామసభల్లో అభివృద్ధి పై చర్చించండి

శృంగవరపుకోట : జనవరి 2 నుంచి జరగనున్న గ్రామ సభల్లో సంక్షేమ పథకాల గురించే కాకుండా అభివృద్ధి గురించి, నిధులు, విధులు గురించి చర్చ జరపాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి కాంద్రేగుల ప్రసాద్ అన్నారు. శనివారం భవాని నగర్ గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి గ్రామ సభలోను పంచాయతీలో జరగబోయే అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చ జరపాలన్న పంచాయతీరాజ్ కమిషనర్ విడుదల చేసిన ఆదేశాలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామ సభలపై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా గ్రామ సభలు జరగాలని ఆయన కోరారు.

సిఐ ఉత్తమ సేవలకు పురస్కారం

కొత్తవలస : వివిధ కేసుల్లో ప్రతిభ కనబర్చిన అధికారులకు విజయనగరం జిల్లా ఎస్‌పి ఎం. దీపిక పాటిల్ ప్రశంస శనివారం పత్రాలు అందజేశారు. అందులో భాగంగా కొత్తవలస సిఐ ఎస్.బాల సూర్యారావుకు 2022 సంవత్సరానికి గాను వివిధ కేసులు సంబంధించి, నేరాలు చేదించడం, దర్యాప్తు చెయ్యడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి నందుకు గాను ఆమె పురస్కారాన్ని అందజేశారు.

నేడు దాసరి ఆణిముత్యాలకు సన్మానం

శృంగవరపుకోట : దేశ, రాష్ట్ర స్థాయిలో దాసరి కులానికి పేరు ప్రత్యేకతలు తెచ్చిపెట్టిన దాసరి కుల ఆణిముత్యాలైన ఇండియన్ క్రికెటర్ అమిటి రవి, పాడుతా తీయగా సింగర్ మోపాడ శ్యామ్‌లకు ఆదివారం దాసరి యువత ఆధ్వర్యంలో సన్మానం చేయనున్నట్లు ఆంధ్ర యూనివర్సిటీ పిహెచ్‌డి స్కాలర్ సిహెచ్ శేషగిరిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతిభ ఉన్నవారికి ప్రోత్సాహం అందిస్తే వారు దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకు వస్తారని ఆ కోవకు చెందిన రవి, శ్యామ్‌లను పట్టణంలో ఊరేగించి అనంతరం ఘనంగా సన్మానిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

టిడ్కో లేఅవుట్ పరిశీలన

బొబ్బిలి : మున్సిపల్ కమిషనర్ యస్. శ్రీనివాసరావు శనివారం క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా జగనన్న కాలనీ (టిడ్కో లే అవుట్- 1, టిడ్కో లే అవుట్-2)లో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. లే అవుట్‌నకు ఎప్రోచ్ నిర్మాణంలో భాగంగా జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించి గుత్తేదారుకు సూచనలు జారీ చేశారు. లబ్దిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేసినందున వాటరింగ్ చేయడానికి వీలుగా బోర్లు అందుబాటులో ఉండేలా చూడాలని మోటారుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని అక్కడ ఉన్న సూపర్ వైజరుకు ఆదేశించారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

విజయనగరం టౌన్ : పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు మానుకొని^హలపై కాకుండా రాష్ట్ర అభివద్ధిపై జగన్ మనసు పెడితే బాగుంటుందని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యలపై పవన్ కల్యాణ్ పోరాడుతుంటే సమాధానం చెప్పకుండా ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీలు కూడా జగన్ ప్రభుత్వం నెరవేర్చలేదంటూ విమర్శించారు. జనసేన పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యువశక్తి కార్యక్రమం జనవరి 12న రణస్థలంలో జరుగుతుందని, జిల్లా నుండి యువత హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

డిసిఎంఎస్ చైర్మన్ శుభాకాంక్షలు


ఎస్‌పికు శుభాకాంక్షలు చెబుతున్న అవనాపు దంపతులు

విజయనగరం టౌన్ : వైసిపి నాయకులు అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన శనివారం పలువురు అధికారులను, ప్రజాప్రతి నిధులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్‌పి ఎం.దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర అశోక్, ఆర్‌డిఒ సూర్యకళను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

ఆస్తి నష్టం అంచనా

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామంలో కోటిపల్లి గురువులకు చెందిన పొలంలోని వరి కుప్పలు శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదానికి గురయ్యాయి. తహశీల్దార్ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు శనివారం విఆర్‌ఒ రవికుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ అరుంధతి సంఘటన స్థలానికి చేరుకొని నష్టాన్ని అంచనా వేశారు. సుమారు రూ.40 వేలు ఆస్తి నష్టం జరిగిందని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రైతు కుటుంబ సభ్యులు అధికారుల ముందు బోరున విలపించారు.


నూతన సంవత్సర వేడుకల్లో సందడి చేస్తున్న పాఠశాల ప్రతినిధులు, విద్యార్థులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ఓక్లాండ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలను విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పాల్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సిహెచ్ రవి, యాజమాన్య ప్రతినిధి శివ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో గడపగడపకు..

ప్రజాశక్తి- దెంకాడ

మండలంలోని మోపాడ సచివాలయం పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందని వారు సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తనకు, సిఎం జగన్మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి తమ్మునాయుడు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.


దెంకాడ: విద్యార్థులకు ట్యాబ్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

కెజిబివి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

స్థానిక కెజిబివి పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉచిత ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను వినియోగించుకుని ఉన్నత చదువులను చదవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జామి : మండలంలోని అలమండ గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, మండల పార్టీ కన్వీనర్ గొర్లె రవి కుమార్, అలమండ సూరిబాబు రాజు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, స్థానిక సర్పంచ్ కోట పాపమ్మ, వైస్ సర్పంచ్ లగుడు దేముడు, బండారు వెంకటరావు, అప్పలనాయుడు, రామయ్య పాలెం సత్యం, తాండ్రంకి దశరథ్, అన్నంరాజు పేట సూరిబాబు, పావడ అప్పలనాయుడు, లగుడు సూర్యనారాయణ, సర్పంచులు, ఎంపిటిసిలు, రాష్ట్ర డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

రూ.10 లక్షలు అందజేత

జామి : అలమండ గ్రామానికి చెందిన కె. కృష్ణంరాజు కాలేయం మార్పిడి శస్త్ర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం కృష్ణంరాజుకు అందించారు. ప్రజల కష్టాల్లో వైసిపి ప్రభుత్వం, స్థానిక నాయకులు వేదోడుగా ఉంటారని ఎమ్మెల్యే అన్నారు. అందులో భాగంగానే ముఖ్య మంత్రి సహాయ నిధి అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, మండల పార్టీ కన్వీనర్ గొర్లె రవి కుమార్, అలమండ సూరిబాబు రాజు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, స్థానిక సర్పంచ్ కోట పాపమ్మ, వైస్ సర్పంచ్ లగుడు దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బహుముఖ పోటీలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల స్థాయిలో శనివారం ఎస్‌విఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రాంగణంలో ఆటల పోటీలు నిర్వహించారు. ప్రారంభ సూచికగా ఎస్ఎఫ్ఐ లక్ష్యాలు అయిన స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం నినాదాలు కలిగిన జెండాని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.శంకరరావు ఆవిష్కరించారు. అనంతరం వివిధ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులకు పలు ఆటలలో పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. హర్ష మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో విద్యా వ్యతిరేక విధానాలను ప్రవేశపెడుతున్న ప్రభుత్వాలపై పోరాడాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ఇప్పటికే రాష్ట్రంలో అనేక పాఠశాలలను ప్రభుత్వం మూసివేసిందన్నారు. ఈ నూతన జాతీయ విద్యా విధానం కారణంగా దేశంలో ఎంతోమంది విద్యకు దూరమవుతున్నారని, ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల పోరాటాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వాలీబాల్ అండర్ 21 పురుషుల విభాగంలో శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాల విజేతగా నిలిచింది. కబడ్డీ అండర్ 21లో ఎస్‌విఎస్‌ఆర్ జూనియర్ కళాశాల (పురుషులు), అండర్ 21 బాలికల విభాగంలో శ్రీ సూర్యోదయ జూనియర్ కాలేజ్, షటిల్ అండర్ 21 బాలికల విభాగంలో శ్రీశ్రీనివాస జూనియర్ కాలేజ్ విద్యార్థులు గెలుపొందారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్, జిల్లా నాయకులు సోమేశ్ అభినందనలు తెలిపగా జిల్లా కమిటీ సభ్యులు అర్జున్, నాయకులు పవన్, రాఘవేంద్ర, అప్పన్న, భాస్కర్, మనీ తదితరులు పాల్గొన్నారు..



వాలీబాల్ పోటీల్లో తలబడుతున్న క్రీడాకారులు

చదువుతోపాటు భద్రత అవసరం

నెల్లిమర్ల : బాలికలకు చదువుతో పాటు భద్రత అవసరమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు తెలిపారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా బాలల సంక్షేమ సమితితో కలిసి సందర్శించారు. విద్యా విధానం, మౌలిక సదుపాయాలు పై ఆరా తీశారు. ఇటీవల కాలంలో సిబ్బంది పై వచ్చిన ఆరోపణలపై రెండు రోజుల్లో పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ప్రిన్సిపల్‌కి ఆదేశించారు. ఈ సందర్భంగా అప్పారావు వేర్వేరుగా ఉపాధ్యాయ సిబ్బంది, బోధనేతర సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందితో సమావేశమై బాలల గురుంచి ఆరా తీశారు. పెయింటింగ్, డ్రాయింగ్, పాటలు, చదువు విషయంలో ప్రతిభ కనబరిచిన వారిని అభినందించారు. బాలికలు అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు. బోజనాలు, వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. వసతి గృహంలో విద్యను అభ్యసిస్తున్న బాలికలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, వెలుతురు, విద్యుత్ సదుపాయాలు, తగినన్ని తరగతి గదులు ఉండాలని సూచించారు. తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు తప్ప ఇతరులను పాఠశాల ఆవరణలోకి అనుమతించరాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ జి. హిమ భిందు, సభ్యులు సుధారాణి, పట్నాయక్, భవాని, ప్రిన్సిపల్ కె. ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కేసలి

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - గుర్ల

నెల్లిమర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల గుర్ల, నెల్లిమర్ల మండలలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్, హెల్పర్, మినీ అంగన్వాడీ హెల్పర్ నియామకానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఇంచార్జ్ పిఒ శకుంతల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక అంగన్వాడీ వర్కర్, 6 హెల్పర్స్, ఒక మినీ హెల్పేర్ కలిపి 8 ఖాళీలు భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందన్నారు. నెల్లిమర్ల మండలంలో గొర్లిపేట అంగన్వాడీ కార్యకర్త ఎస్‌సి కేటగిరి కేటాయించామన్నారు. చిన్న బూరాడపేట (ఎస్‌సి), పెదబూరాడపేట (బిసిఎ), నారాయణపట్నం (ఎస్‌టి), గుర్ల మండలంలో మన్యపురిపేట (ఒసి), కలవచర్ల (ఒసిఒహెచ్), భూపాలపురం-1 (ఒసి)కు కేటాయించామన్నారు. అర్హులైన అభ్యర్థులు 2023 జనవరి 7వ తేదీ లోగా కార్యాలయం పని వేళల్లో నెల్లిమర్ల ఐసిడిఎస్ కార్యాలయానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గడువు తరువాత వచ్చిన దరఖాస్తులు తీసుకోవడం జరగదన్నారు.

భోగాపురం: భోగాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 9 ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ జె.సుగుణవతి తెలిపారు. స్థానికులై ఉండి 21 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి, పదో తరగతి పాసై ఉండాలని, రిజర్వేషన్ ఆధారంగా ఎంపికలు జరుగుతాయని తెలిపారు. మండలంలో జగ్గయ్యపేట (బిసి-ఈ) అంగన్వాడీ కార్యకర్త, చినకొండ రాజుపాలెం హెల్పర్(బిసి-డి), రామచంద్ర పేట మినీ అంగన్వాడి (బిసి-ఎ), పూసపాటిరేగ మండలం పేరాపురం-1 అంగన్వాడి కార్యకర్త (బిసి-సి), కొల్లాయివలస హెల్పర్ (బిసి-ఎ), కొత్త నడిపల్లి(బిసి-ఈ), పెద్ద బత్తివలస(ఎస్‌సి) మినీ అంగన్వాడీలు, డెంకాడ మండలం వెదుళ్ళ వలస అంగన్వాడీ కార్యకర్త (బిసి-డి) పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

స్థలాల అమ్మకాలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని అమ్మిగారి కొనేరుగట్టు స్థలాలు అమ్మకాలు జరుగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని టిడిపి కౌన్సిలర్ రాంబార్కి శరత్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో శనివారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు గట్టు స్థలాలను అక్రమించేసి అమ్మేస్తున్నారని ఆరోపించారు. చెరువుగట్టు స్థలాలు అమ్మకాలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. గట్టుపై ఒక దగ్గర స్థలం ఇస్తే మరోచోట నిర్మాణాలు చేస్తున్నారన్నారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం ప్రభుత్వ పరంగా నిర్వహిస్తున్నారా, ప్రైవేట్ కార్యక్రమమా అని అధికారులను ప్రశ్నించగా ప్రభుత్వ కార్యక్రమం అని కమిషనర్ శ్రీనివాసరావు సమాధానం చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమం అయినప్పుడు టిడిపి కౌన్సిలర్లకు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

ఇళ్ల స్థలాలు అమ్మే హక్కు ఎవరికి లేదని, స్థలాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శంబంగి హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ఇచ్చి, అభివృద్ధి చేస్తున్నామన్నారు. పట్టణంలో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వీధి దీపాలు వేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంబంగిను టిడిపి ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు కోరారు. పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు మురళి, రమాదేవి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి గుర్తింపు

ప్రజాశక్తి- బొబ్బిలి

పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలకు, నాయకులకు మంచి గుర్తింపు వస్తుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. టిడిపి రాష్ట్ర కమిటీకి నూతనంగా నియమితులైన అల్లాడ భాస్కరరావు, చింతల రామకృష్ణ, మండల స్థాయి నాయకులు శనివారం కోటలో బేబినాయనను కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతిఒక్కరికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కలిసి పని చేయాలని కోరారు. నియోజకవర్గంలో టిడిపి విజయానికి పని చేస్తామని అల్లాడ భాస్కరరావు, చింతల రామకృష్ణ అన్నారు.


బేబినాయనను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎపిజిఇఎ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లిమర్ల : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎపిజిఇఎ నెల్లిమర్ల తాలూకా శాఖ రూపొందించిన 2023 నూతన క్యాలెంటర్‌ను ఎంపిడిఒ జి. గిరిబాల చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం సహ అధ్యక్షులు హెచ్. భానోజీ రావు, తాలూకా శాఖ అధ్యక్షులు పి. వీరన్న దొర, పి.శంకరరావు, పి.సర్వేశ్వర రావు, బొద్దాన శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం : పిఆర్‌టియు క్యాలెండర్‌ను శనివారం మండలంలోని ఎంఆర్‌సి కార్యాలయం వద్ద పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆల్తి రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, నూతన క్యాలెండర్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంబంధించిన విషయాలు అన్ని క్రోడికరించామన్నారు. వాటిని విద్యార్థులు, ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని తెలిపారు. నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని, అందరు మంచిగా వుండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పిఆర్‌టియు అధ్యక్షులు ఆర్. సింహాద్రి, ఆల్తి శ్రీహరి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తూడెంలో భూ రీసర్వే

భోగాపురం : మండలంలోని బసవపాలెం రెవెన్యూ పరిధిలోని తూడేం గ్రామంలో రెండు రోజులుగా జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా రెండు రోజులుగా భూ రీసర్వే సాగుతోంది. తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ గల రైతులకు వివాదాలు, చిక్కులు లేకుండా సర్వే చేస్తున్నామన్నారు. రైతులకు భూములపై శాశ్వత హక్కులు కల్పించడమే లక్ష్యంగా సర్వే చేస్తున్నామన్నారు. దీన్ని పరిగణలోకి తీసుకుని సిబ్బంది సక్రమంగా సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ కిరణ్, విఆర్‌ఒ అనురాధ, గ్రామ సర్పంచ్ గాలి నర్సయ్యమ్మ, వైసిపి నాయకులు గాలి రాజారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయోగపడేవే తీసుకురండి: ఎమ్మెల్యే

శృంగవరపుకోట : నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు చెప్పడానికి తన కార్యాలయానికి వచ్చే నాయకులు, కార్యకర్తలు, ప్రజలు బొకేలు, స్వీట్లు కాకుండా విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు మాత్రమే తీసుకు రావాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. సాలువాలు, బొకేలు తీసుకొచ్చి డబ్బులు వృధా చేయకుండా ప్రతి ఒక్కరూ విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులనే తీసుకు రావాలని ఆయన కోరారు.

మండల బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ధార అప్పలనర్సమ్మ, వైస్ ఎంపిపి టంకాల అచ్చెం నాయుడు అధ్యక్షతన శనివారం మండల బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2022-24 రెండేళ్ల పాటు బడ్జెట్ సమావేశాలలో భాగంగా సాధారణ ఖర్చులలో ఎలిమెంటరీ విద్య, స్త్రీ శిశు సంక్షేమం, పెన్షన్లు, ఏసిడిపికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం, సిబ్బంది జీతభత్యాలు, ఉపాధి హామీ పథకం తదితర ఆదాయ, ఖర్చులు, జమలు వంటి వాటిపై అంచనా బడ్జెట్ వేశారు. 2022-23 ఏడాదికి సంబంధించి సవరణ బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.29.72 కోట్లు కాగా రూ. 27.83కోట్లు ఖర్చులు చూపారు. ముగింపు నిల్వ రూ.1.88కోట్లు నిర్ధారించారు. 2023-24 ఏడాదికి సంబంధించి సవరణ బడ్జెట్ ప్రారంభ నిల్వలు రూ.57.26 కోట్లు కాగా రూ. 55.77 కోట్లు ఖర్చులుగా చూపారు. ముగింపు నిల్వలు రూ.1.48కోట్లుగా నిర్ధారించారు. సాధారణ ఖర్చులు రూ. 33.70కోట్లు కాగా, ఏసిడిపి కింద రూ.55.62కోట్లు ఖర్చులు చూపారు. నికర ఆదాయం రూ. 1.83 కోట్లు కాగా అంచనా బడ్జెట్ రూ.1.88 కోట్లు వేశారు. సవరణ బడ్జెట్ రూ.1.60కోట్లు వేయగా రూ.1.48కోట్లు అంచనా బడ్జెట్ వేశారు. ఈ బడ్జెట్ సమావేశంలో ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాధ రావు, సీనియర్ సహాయకులు ఉన్నారు.



బడ్జెట్ నివేదికను వెల్లడిస్తున్న అధికారి

కొండరాజుపాలెంలో 'ఇదేం కర్మ'

భోగాపురం : మండలంలోని కొండరాజుపాలెం గ్రామంలో శనివారం రాత్రి టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అరాచకాలను తిప్పి కొట్టాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరిగారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోరాడ తాతారావు, పిడుగు తోటారావు, కర్రోతు రాజు, మైలపల్లి ఎల్లాజీ, ఎంపిటిసి పిడుగు వెంకటసత్యం, మధు, గురుమూర్తి, బడే యర్రయ్య, లక్ష్మణరావు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని పాలకొండ- రాజాం ప్రధాన రహదారి బూరాడ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దశిర్లాం గ్రామానికి చెందిన సంచాన విష్ణుమూర్తి (40) మృతి చెందాడు. అతను తన ద్విచక్ర వాహనంతో రాజాం నుంచి తిరిగి వస్తుండగా శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో పంట పొలాల్లోకి వాహనంతో సహ వెళ్లి పడి అక్కడికక్కడే మృతి చెందారు. విష్ణుమూర్తి గ్రామంలో సప్లయర్ పనులతో పాటు డిస్ ఆపరేటర్ గా పని చేస్తున్నారు. రాజాంలో అన్ని పనులు ముగించుకుని తిరిగి స్వ గ్రామానికి ద్విచక్ర వాహనంతో వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం డీకొని వెళ్లిపోయింది. స్థానికులు రేగిడి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుని జేబులో ఉన్న ఆధారాలు ప్రకారం మృతుని భార్య అప్పలనారాయణమ్మ, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు పంచినామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం రాజాం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మృతుడు విష్ణుమూర్తి

కన్నీరు మున్నీరుగా విలపించిన భార్య

కుటుంబ యజమాని మృతి చెందడంతో తన కుటుంబం వీధిన పడిందని మృతుని భార్య అప్పలనారాయణమ్మ రోధించిన తీరు చూపరలను కంటతడి పెట్టించింది. సప్లయర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఇలా అర్థాంతరంగా మృత్యువాత పడటంతో ఇద్దరు పిల్లలతో ఎలా బ్రతికేదని ఆమె రోధిస్తుంది. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు.

చోరీ నిందితురాలు అరెస్టు

విజయనగరం : బంగారు ఆభరణాలు చోరీ చేసిన నిందితురాలిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు రూరల్ సిఐ టివి తిరుపతిరావు శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. విజయనగరం మండల పరిధిలోని ముడిదాం గ్రామానికి చెందిన గంట్రేటి గాయత్రి కుటుంబ సభ్యులతో కలిసి నవంబర్ 6న చీపురుపల్లి అత్తగారింటికి వెళ్ళింది. తిరిగి ఆమె విజయనగరం ఆటోలో వస్తుండగా విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర ఆమె తన బ్యాగ్‌ను చూసుకునేసరికి అందులో ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. దీంతో ఆమె రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన రూరల్ పోలీసులు చెల్లూరు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న మెంటాడ మండలం పిట్టాడ గ్రామానికి చెందిన గొర్లె మౌనికను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆటోలో వస్తుండగా బంగారు ఆభరణాలను తానే చోరీ చేసినట్లు ఆమె విచారణలో అంగీకరించింది. ఆమె నుంచి బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చోరీ సొత్తును త్వరిత గతిన రికవరీ చేసిన రూరల్ ఎస్ఐ గణేష్, ఎఎస్ఐ త్రినాధ్‌రావు, కానిస్టేబుల్ షఫీలను ఎస్‌పి ఎం. దీపిక అభినందించారు.

హోంగార్డుకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి- విజయనగరం

జిల్లా పోలీసుశాఖలో హోంగార్డు విభాగంలో పని చేస్తూ, ఉద్యోగ విరమణ చేసిన మెండ ధర్మారావుకు జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఎం.దీపిక మాట్లాడుతూ - విశాఖ స్టీల్ ప్లాంట్‌లో డిప్యూటేషన్ పై పని చేసిన ధర్మారావు ఎంతో క్రమశిక్షణ, అంకితభావంతో 21 సంవత్సరాలు పని విధులు నిర్వహించారన్నారు. పోలీసుశాఖకు ధర్మారావు చేసిన సేవలను కొనియాడారు. శేష జీవితంను కుటుంబ సభ్యులతో ఆనందంగా, సంపూర్ణ ఆరోగ్యంతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం, ధర్మారావుకు పూలమాల వేసి, శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, హోంగార్డ్స్ ఇంఛార్జ్ కేశవరావు, ధర్మారావు కుటుంబ సభ్యులు, ఇంఛార్జి డిఎస్‌పి శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ధర్మారావును సత్కరిస్తున్న ఎస్‌పి దీపిక

గొర్రె పందేల శిబిరంపై పోలీసుల దాడులు

వంగర : మండలంలోని రాజుల గుమ్మడలో నిర్వహించిన గొర్రె పందేల శిబిరంపై ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు అక్కడ పట్టుబడిన రూ. 1720 నగదు స్వాధీనం చేసుకుని, మూడు గొర్రెలును సీజ్ చేసి, ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.